కథ



# పార్థసారథీ పారిపో!

-వల్లభాచార్య

నన్ను నేను తిట్టుకున్నాను అక్కడికి ఎందుకు వెళ్లానా అని! చెబితే నమ్మరు కానీ అసలు నన్ను నేనే చంపేసుకుందామనుకున్నాను అక్కడికి వెళ్లినందుకు!

నిజం! మీకు తెలియదు నా బాధ! నిజానికి నేనే చచ్చేపోయాను అక్కడి నుంచి వచ్చిన తరువాత!

మీకలాగే ఉంటుంది ఏమిటీ సోదీ అని! కానీ నా గుండె బద్దలయిపోయింది! నా స్వర్ణ స్వప్నం కరిగిపోయింది! ఎవరో లాగిపెట్టి కొట్టినట్టయిపోయింది.!

అసలింతకీ ఏమయిందో చెప్పాలంటే పాతికేళ్ల వెనక్కి వెళ్లాలి మరి... ఓపికుంటే వినండి! మీరందరూ కలిసి చేసిన ఘనకార్యమే అది! పాతికేళ్ల వెనక్కి అంటే... ఇప్పుడు నాకు ముప్ఫయ్ అయిద్దేళ్లు కదా... అప్పుడు పదేళ్లన్నమాట.

అప్పట్లో రెండ్రోజులకోసారి జ్వరం వచ్చేది నాకు. అంటే ఎప్పుడూ జ్వరమే. మా తాతకి ఏవీ తోచేది కాదు. అన్నట్టు చెప్పలేదు కదూ... నన్ను మా తాతే పెంచాడు. మా నాన్న ఎక్కడెక్కడో ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. కొన్నాళ్లక్కడ... కొన్నాళ్లిక్కడ ఉంటూ ఉండేవాడిని, కానీ మొత్తం మీద మా తాతదగ్గిరే ఎక్కువ. ఆయనకీ నేనంటే అమిత ప్రేమ... చాలా కాలం ఉండేది... నేను బాగా పెద్దవాడిని అయ్యేవరకూ!

ఇంతకీ నా జ్వరం సంగతి కదా చెబుతున్నాను. అలా అలా చాన్నాళ్లూ జ్వరం వచ్చిపోతూ ఉండగా ఓ విచిత్రం కనిపెట్టాడు మా తాత. జ్వరం లేనప్పుడు కూడా నార్మల్ టెంపరేచర్ తొంభయ్ తొమ్మిది డిగ్రీలు ఉండేది! అది కనిపెట్టాక మా తాతకి పంతం వచ్చింది. ఎలాగైనా సరే వీడి 'రోగం' కుదర్చాలి అనీ... వీటి టెంపరేచర్ను అందరికి మల్లే 'నార్మల్'కి దింపాలనీను.

ఆ పంతం రావడంతోనే నన్నూ మా మామ్మనీ 'చెన్నపట్నం' బయల్దేరదీశాడు. ఎందుకో గానీ మద్రాసు అనడం కన్నా చెన్నపట్నం అనడమే బాగుండేది నాకూ, మా తాతకీనీ! మా మామ్మ సరేసరి... ఆ మహాపట్నంలోనే పెరిగి, పెద్దయి, మా తాతని పెళ్లాడి, హైకోర్టు గుంటూరుకి మారే వరకూ జీవితాన్ని సాగించిందీ. మా తాత అని కాదు కానీ మద్రాసు, గుంటూరు హైకోర్టుల్లో మాంచి నరుకున్న ప్లీడరాయన. హైకోర్టు హైదరాబాద్కు వచ్చేసిన తరువాత రాజమండ్రీ వెళ్లిపోయాడు. అందుకే వాళ్ల జీవితాల్లు చెన్నపట్నంతో పెనవేసుకుపోయాయి. చదువుకోవాలంటే... అసలు చదువు రావాలంటే... చెన్న పట్నమే అనే

వాడాయన. అలాగే 'ట్రీట్‌మెంట్' అన్నా ఆ ఊరే ఆయనకి! ఏతావాతా నా 'రోగం' కుదర్చడానికి చెన్నపట్నం చేర్చాడాయన. వెళ్లడం వెళ్లడం మా మామ్మ అప్పుగారింట్లో... జార్జి టవున్లో మకాం పెట్టాం. ఆవిడకి పిల్లలు లేరు. అప్పట్లో మనం మహాముద్దుగా ఉండేవాళ్లం. సరే అదంతా ఎందుకులెండి.

నా రోగం కుదర్చడానికి మా తాత జమిలి వైద్యం మొదలెట్టించేశాడు. మైలాపూర్‌లో నరసింహారావుగారనే హోమియో వైద్యుడి దగ్గిరా, చాకలిపేటలో "డాక్టర్ పిళ్లై ఎం.డి' - మా తాత అలాగే అనేవాడు ఆయన్ని - దగ్గిరానూ. అలా పొద్దున్నా సాయంత్రం ఈ ఇద్దరు అపర ధన్వంతరుల దగ్గరికీ తీసుకువెడుతూ ఉండేవాడు. ఆ వైద్యం ఏదో చేయించేసి చక్కా వస్తే ఇప్పుడీ బాధ ఉండేది కాదు నాకు. "ఆల్ ఈజ్ వెల్ విత్ ద వరల్డ్" అని హాయిగా ఉండేవాడిని. అబ్బే! ఇలా రాసిపెట్టి ఉంటే అలా ఎందుకు జరుగుతుందీ?

ఓ రోజు సాయంత్రం మైలాపూరు నుంచి వస్తూ ట్రిప్లికేన్‌లో పార్థసారథిస్వామి కోవెలకి తీసుకువెళ్లాడు మా తాత.

ఆ రోజు బాగా జ్ఞావకం నాకు...

ఎంత జ్ఞాపకమంటే... పాతికేళ్లు గడచిపోయినా ఆ బొమ్మ అలాగే నిలబడేపోయింది నా కళ్లలో!

ఆ రోజు గుడికి వెళ్లామా. ముందు పెద్ద పెద్ద రాతి స్తంభాలలో ముఖమంటపం. అప్పుడు తెలియదు కానీ ఇప్పుడు అనుకున్నాను ఆ మంటపంలో నడుస్తూ ఏ కృష్ణరాయల సభలోకో వెడుతున్నానని. అలా లోపలికి వెళ్లాక గర్భగుడి ముందు సన్నని దోవ. ఓ వైపు నుంచి వెళ్లి మరో వైపు నుంచి - ఆ దోవలోనే - రావాలి. మధ్య 'హద్దు' ఏమీ లేదు. ఆ నడవాలో అక్కడక్కడ నూనె దీపాలు. వాటి మనక వెలుతురు. దోవ నిండా ఒకటే జనం ఊపిరాడకుండా. గాలి ఆడదు. చెమటలు కారిపోతున్నాయి. చిన్న వాణ్ని కదా - ఎదరేవుందో కనిపించదు. సగం దోవలోకి వెళ్లాక మా తాత నన్ను ఎత్తుకున్నాడు. ఆయన ఎత్తుకున్నాక ఎదటి దృశ్యం కనిపించింది. ఒక్క క్షణం భయం వేసింది. అంతలోనే ఎవరో నిలువెత్తు మనిషి మబ్బుల్లోనించి దిగివస్తున్నట్లనిపించింది.

ఎదురుగా గర్భగుడి...

దానిలో పెద్ద దీవపు సెమ్మెలూ...

వాటినిండా నూనె... ఎనిమిదేసి దీవ కళికలు...

అగరువత్తులు ఎన్ని వెలిగించారో కానీ... గర్భగుడి అంతటా

సుగంధ మేఘాలు...

ఆ పొగ మబ్బులు వలచబడినప్పుడల్లా...

ఆ నూనె దీపాల మనక వెలుతురులో...

నిలువెత్తు విగ్రహం... మబ్బుల్లోంచి దిగివస్తున్న మనిషిలా!

ఆ విగ్రహం ఎలా ఉంది?

నిలువెత్తు విగ్రహం అని చెప్పాను కదా!

కుడి చెయ్యి నడుము మీద ఉంది

ఎడమ చేతిలో కొరడా

మురళి మొలదట్టీలో నిదురపోతోంది

ఆ స్వామికి మీసాలు కూడా ఉన్నాయి

నల్లగా నిగనిగలాడిపోతోంది బొమ్మ

ఆయనే పార్థసారథి!

నా కోసం... కేవలం... నా ఒక్కడి కోసమే...

మబ్బుల్లోంచి... కాదు కాదు...

కురుక్షేత్ర సంకుల సమరాంగణంలో


రథ చక్రోద్భూత ధూళి మేఘాల మధ్య నించి నడచి వస్తున్నట్లుంది.

ఇలా అంటున్నానంటే ఆ పదేళ్లప్పుడు ఇలాగే అనుకున్నానని కాదు. ఆ బొమ్మ అలా నా కళ్లలో నిలబడిపోయి నిరంతరంగా, నేను స్మరించినప్పుడల్లా అలా కనిపించేది తరవాత్తరవాత. ఎంత బాగున్నాడో ఆయన! ఎంత కర్తవ్య నిష్ఠుడాయన! ధర్మం కోసం బండి తోలడానికి కూడా 'నామోషీ' పడని కర్మవీరుడు కదూ ఆయన!

నిజం చెప్పొద్దూ... ఆ చిన్నతనంలో... ఆ బొమ్మ కృష్ణుడిదంటే ఎందుకోకానీ ఎంత మాత్రమే నచ్చలేదు నాకు... కానీ ఆ దృశ్యం మ్మాత్రం నిలిచిపోయింది. బతుకు ఎదిగిన కొద్దీ... ఆ బొమ్మకీ, ఆ దృశ్యానికీ కూడా అర్థం ఎదుగుతూ వచ్చిందనుకుంటాను లోపల్లోపల! అదే... ఇంత బాధకీ కారణమైపోయింది ఇప్పుడు!

మొన్నటికి మొన్న ఏం జరిగింది?

ఇన్నేళ్లూ ఆంధ్ర రాజధానిలో పడివుండి ఓ పని తగిలి తమిళ రాజధానికి వెళ్లవలసిన అగత్యం ఏర్పడింది. అంతకు ముందూ నాలుగైదు సార్లు చెన్నపట్నం వెళ్లాను కానీ గుళ్లూ, గోపురాలూ చూసే తీరికలేకపోయింది. పొద్దున్న బండి దిగడం, సాయంత్రం బండి ఎక్కడంగా




అయిపోయింది. ఈసారి ఓ వారం మకాం. తీరా వెళ్లాక... ఖాళీ దొరకక... ఉన్నట్టుండి ఓ సాయంత్రం చిన్ననాటి బొమ్మ కళ్లల్లో మ్మెదిలి పీకల మీ్మద కూచుంది. బయల్దేరాను.

అప్పటికే ఆరున్నరో, ఏడో అయింది. అబ్బో జనం ఎంతమంది ఉంటారో అనుకుంటూనే వెళ్లాను. ముఖ మంటపం చుట్టూ పూలకొట్లు, మనిషెత్తు తులసి మాలలు అమ్ముతున్నారక్కడ. చిన్నప్పుడు వాటిని కొన్నామో లేదో జ్ఞాపకం లేదు... ఇప్పుడూ కొనలేదనుకోండి. ముఖ మంటపంలో నడుస్తూ ఉంటే అంతా ఖాళీ. సింహ ద్వారం దాటాను. గర్భగుడి దాకా పట్టపగల్లూ... ఆరుబయలులూను! ఒక్క మనిషి లేడే! సరే ఇదీ బాగుంది... అందరు వెళ్లిపోయారనుకుంటూ... ఆ తొక్కిడీ, వుడకపోత లేవనుకుంటూ లోపలికి నడిచా.

గర్భగుడి ముందు సన్నని దోవ దాకా వచ్చా. అక్కడంతా పండు వెన్నెల్లా ఉంది. దేదీప్యమానంగా ఓ వేపర్ లాంప్ వెలుగుతోంది. అక్కడక్కడా ఫాన్లూ ఉన్నాయి. ఆ దోవ పొడవునా మధ్యలో ఇనుప గొట్టాలు పాతి గొలుసు కట్టారు. ఇటు నుంచి వెళ్లి అటు నుంచి రావాలని ఇంగ్లీషులో 'ఇన్', 'అవుట్' అని బోర్డు కూడా పెట్టారు. గర్భగుడీ ముందు తెర వేసి ఉంది... లోపల ఆరగింపు అవుతోందనుకుంటాను. దగ్గరగా వెళ్లి నిలుచున్నాను... ఆ నడవా అంతటికీ ఒక్కణ్నే కదా!

ఊపిరి బిగపట్టి చూస్తున్నాను... 'తెర తీయగరాదా' అని త్యాగరాజు లోపల్లోపల పాడుచున్నాడు. తెర తొలగిపోవాలీ... ఆనాటి స్వామి కనిపించాలి... ఆ సుగంధ మేఘాల మధ్య నుంచి... నా కోసం... నా ఒక్కడి కోసమే దర్శనం ఇవ్వాలివ్వాళ... అందుకే కదా ఎవరూ లేకుండా చేశాడు నేను వచ్చేసరికి! చుట్టూ ఉన్నదేదీ కనపడడం లేదు నాకు... ఒక్కటే... ఆ తెర వెనుక... పాతికేళ్లుగా నా కంటి వెలుగుగా నిలిచిన బొమ్మ... పార్థసారథి... సాక్షాత్కరించాలి. చిత్త ఏకాగ్రత అంటారే... అలా ఉంది.!

ఎదురు చూసిన క్షణం... ఎంతలో వస్తుందీ? తెర తొలగిపోయింది... ఎదురుగా చూశాను కళ్లల్లో ప్రాణాలు నింపుకొని... ఆత్మనంతా అంజలి పట్టి.

కానీ... కానీ...

నా ఎదురుగా...

ఏడీ నా స్వామీ?

చిక్కని వెలుగులు చిమ్మే ట్యూబ్ లైట్ల మధ్య

ఎవడో... వీడెవడో...

పగటి వేషగాడు నిలబడ్డాడే!

వీడూ నిలువెత్తున్నాడు...

నల్లటివాడే, అందుకని మీసాలు కనబడాలని కాబోలు తెల్లటి రంగు వేశారు మీసాల్లాగ!

వాడి ఒంటి నిండా పీక నుండి నడుము దాకా దీర్ఘ చతురస్రాకారంగా ఇత్తడి తొడుగు!

ఆ తొడుగు మీద ఏడుకొండల వాడికి 'డూప్'లాగ కాసుల పేరు!

వాడి గుండెల మీద... ఏమిటది? ఓహో! లక్ష్మీదేవి బొమ్మ గొలుసు వేసి వాడి మెడకే తగిలించి ఉరితీశారు!

ఎవడు వీడు?

ఇక్కడి నా స్వామిని ఏం చేశారు?

ఏడీ ఆ మబ్బుల మధ్య నించి దిగివచ్చిన దేవుడు?

ఏడీ ఆ పార్థసారథి?

అసలు నేను వచ్చింది ఆ గుడికేనా?

అవును! అది మాత్రం పచ్చి నిజం! 'కటిక' నిజం! నేను వచ్చింది ఆ ఆలయానికే!!

కానీ ఈ విద్యుద్దీపాల దెబ్బకు నా కల ఆవిరైపోయింది!

ఈ అలంకరణల ఆడంబరాల్లో నా స్వామి ఇరుక్కుపోయి ఉక్కిరి

బిక్కిరై పగటివేషగాడిలా మారిపోయి, ఇత్తడి తొడుగు ఉక్కులోంచి

బిక్కుబిక్కు మంటూ కొనప్రాణంతో ఉన్నాడు!!

నాకు... ఇన్నాళ్లూ నాతో పాటు ఎదిగి వచ్చిన జీవన చిత్రం...

చిరిగిపోయింది!

నిలబడలేక పోయానక్కడ!

అర్చకుడు ఇస్తున్న తీర్థం తీసుకోకుండానే పారిపోయి వచ్చేశాను. అలా పారిపోతూ నాలో నేను అరుచుకున్నాను...

నాగరకత! నశించిపో!

పార్థసారథీ! పారిపో!

[అసలే నేనిలా ఏడుస్తూంటే "ఆ ఇత్తడి తొడుగు కవచంలోనించి అప్పుడప్పుడూ బొద్దింకలు కూడా బయటికి వస్తుంటాయి తెలుసా?" అని సోదరి డాక్టర్ నీరజా చక్రవర్తి చెప్పగా విని ఇంకా జుట్టు పీక్కుంటూ... మీకందరికీ...] •